క్లుప్తంగా

అకాల వర్షం..పంటకు నష్టం



నేలకొరిగిన వరి

దహెగాం: మండల కేంద్రంతో పాటు, లగ్గాం, ఐనం, బీబ్రా గ్రామాల్లో బుధవారం అకాల వర్షం కురిసింది. అకాల వర్షం కారణంగా పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల వరి నేలకొరిగింది. పగిలిన పత్తి వర్షానికి తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వరి కోతకు వస్తున్న క్రమంలో వర్షం వల్ల ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

పశుపోషణపై దృష్టి పెట్టాలి



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

కౌటాల: రైతులు పశుపోషణపై దృష్టి పెట్టాలని పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. ఉచిత గాలికుంటు నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వీర్దండి గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు రహిత కోసం రైతులు, పశుపోషకులు పశువులకు టీకాలు వేయించాలన్నారు. నాలుగు నెలల వయస్సు పైబడిన పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సందీప్, సత్యనారాయణ, భిక్షపతి, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

'పేపర్ రవాణాకు ఆటంకం కలగనీయొద్దు'



వినపపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు నుంచి ఉత్పత్తి అయ్యే పేపర్ రవాణాకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం ఎస్పీఎం కార్మికులు డీఎస్పీ రామానుజంకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ లారీ అసోసియేషన్ పేరుతో కొందరు ప్రతిరోజూ కంపెనీ లారీల యార్డు వద్ద కర్ర లారీల డ్రైవర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి కోసం తాము రోడ్డుపైకి వస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మిల్లుపై 2500 కుటుంబాలు ప్రత్యక్షంగా, మరో ఐదు వేల కుటుంబాలు పరోక్షంగా ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

లారీ డ్రైవర్లకు బెదిరింపు.. పది మందిపై కేసు

వాంకిడి: సిర్పూర్ పేపర్ మిల్లుకు రావొద్దని మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్లను బెదిరించిన కాగజ్‌నగర్‌కు చెందిన పది మంది లారీ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. కాగజ్‌నగర్‌కు చెందిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, లారీల యజమానులు వెన్న కిషోర్, యూసుఫ్ ఖాన్, ఆవుల రమేశ్, దీకొండ శ్రీనివాస్, మహమ్మద్ గౌస్, శైభాస్ ఖాన్, షేక్ గుల్ మహమ్మద్, మహమ్మద్ ఆరీఫ్, షేక్ సర్వర్ బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న లారీలను ఆపారు. డ్రైవర్లను దుర్భాషలాడుతూ బెదిరించారు. చంద్రాపూర్ జిల్లా బల్లార్షాకు చెందిన లారీ డ్రైవర్ సృజన్‌లాల్ యాదవ్ వాంకిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పది మంది లారీ యజమానులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై పేర్కొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పిల్లలకు, గర్భిణులకు నాసిరకమైన కోడి గుడ్లు, పాల ప్యాకెట్లు ఇస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లోపించిందన్నారు. ఐసీడీఎస్ అధికారులు, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పెళ్లి తంతుపై వేస్తున్న నాటకం



నృత్యం చేస్తున్న గుస్సాడీలు



కోలా ఆడుతున్న ఆదివాసీలు



సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ఆదివాసీలు



అలరించిన గుస్సాడీ నృత్యం

గిరిజన గూడెల్లో గుస్సాడీల కోలాహలం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని చిన్న సాకడ గ్రామంలో దండారీ ఉత్సవాలు అలరించాయి. చిన్నసాకడ గ్రామం వారు ఖట్టిగూడ గ్రామానికి చెందిన దండారీ బృందానికి అతిథ్యం ఇచ్చారు. గుస్సాడీలు డప్పుల చప్పుళ్ల మధ్య అడుగులో అడుగేస్తూ.. నృత్యం చేశారు. ఈసందర్భంగా పెళ్లి తంతుపై వినూత్న రీతిలో నాటకం వేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పటేళ్లు, దేవారి దంబిరావు, మోతిరాం, ఆనంద్‌రావు, జలపతిరావు, మానిక్‌రావు, జంగు, భీంరావు, అర్జున్, ఇస్రూ, సోము, గాగ్రు, బల్లార్‌శావ్, విజయ్ పాల్గొన్నారు. – కెరమెరి

పత్తి రైతుల్లో గుబులు..!

- రెండు రోజులుగా కారుమబ్బులు
- వర్షం పడితే పగిలిన పత్తికి నష్టం
- ఆందోళనలో రైతులు



ఐనం శివారులో పలిగిన పత్తి

దహెగాం: గత మూడు సంవత్సరాలుగా పత్తి రైతులు ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. రెండు సంవత్సరాలుగా వరదల వల్ల పత్తి నీట మునిగి వేల ఎకరాల్లో నష్టపోయిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ప్రాణహిత, పెద్దవాగు ఉప్పొంగడంతో నియోజకవర్గంలో కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, మండలాల్లో పత్తి పంటకు నష్టవాటిల్లింది. ప్రస్తుతం పత్తితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్న క్రమంలో రెండు రోజులుగా కారు మబ్బులు కమ్ముకొస్తున్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

24 వేల ఎకరాల్లో సాగు..

మండల వ్యాప్తంగా సుమారు 24 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభ సమయంలో వర్షాలు మందకొడిగా కురిసినా.. తరువాత వర్షాలు అనుకూలించడంతో పత్తి ఏపుగా పెరిగింది. పూత కాత దశలో వర్షాలు జాడ లేక పోవడంతో దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందని థైతులు పేర్కొంటున్నారు. పూత కాత దశలో వర్షాలు లేక పోవడమే ఇందుకు కారణం. గత రెండు రోజుల నుంచి కారు మబ్బులు వస్తున్నందున వర్షం కురిస్తే పత్తికి నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలు పత్తికి రూ. 6500, నుంచి రూ. 7,000 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. దీంతో రైతులు మరింత నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కన్నెపల్లి, భీమిని పరిధిలో మోస్తారు వర్షం కురిసింది. వర్షానికి పగిలిన పత్తి తడిస్తే గిట్టుబాటు ధర రాదని వాపోతున్నారు.

కూలీల కొరత..

మండల వ్యాప్తంగా పత్తితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో కూలీల కొరత కారణంగా మహారాష్ట్ర, గుజరాత్ నుంచి కూలీలను రప్పిస్తున్నారు. పత్తి తీసేందుకు కిలోకు రూ. 10 రూపాయలు చెల్లించాల్సి వస్తుందని, అదే విధంగా ఆటో చార్జీలు సైతం చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. పెట్టుబడులే అధికంగా పెరిగిపోతున్నాయని రైతుకు మిగిలేదు ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు రూ. 10 వేలు చెల్లిస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిట్టుబాటు ధర పెంచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. కుటుంబ వివరాలతో పాటు ఇతర వివరాలు సేకరించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ నజ్రూల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: త్వరలో ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం కావాలని ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏదైనా సందేహం ఉంటే సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సూపర్‌వైజర్, గ్రామ కార్యదర్శులు, టీఏలు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కౌటాల: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పుష్పాలత, ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం కౌటాల రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందన్నారు. సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులల వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ మస్కూర్ అలీ, ఏపీఎం ముక్తేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన వీరుడు కుమురం భీం అన్నారు. ఆయన చేసిన పోరాటంతోనే ఆదివాసీలకు గుర్తింపు ఉందన్నారు. నిరకుశ పాలనకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సక్కు, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, అలీబిన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతిఒక్కరు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కనికి గ్రామంలో టీజీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలు చేసుకుంటే కుటుంబాలకు ధీమా ఉంటుందన్నారు. మహిళ సంఘాలు బకాయిలు చెల్లించి తిరిగి రుణాలను పొందాలన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాజాత బందం సభ్యులు పలు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, విలాస్, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం



సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో విధులు నిర్వర్తించి బుధవారం పదవి విరమణ పొందిన ఉద్యోగి షేక్ హైమద్ దంపతులను ఓసీపీ అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జ్ఞాపికను అందచేసి శాలువాతో సత్కరించారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు శేషు, దివాకర్, ఓదెలు, రాజన్న, సత్యనారాయణ, కోటి, ధర్మయ్య, కుమారస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: డ్రగ్స్‌తో జీవితాలు నాశమవుతాయని, యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నివారణ పోస్టర్ ఆవిష్కరించారు. మత్తు పదార్థాలతో ఆరోగ్య సమస్యలు వస్తాయని, గంజాయి, గుట్కా, సిగరెట్, డ్రగ్స్, మద్యం జోలికి వెళ్లవద్దని సూచించారు. విద్యార్థులు క్రీడాలు, చదువు పై దృష్టి పెట్టాలని, చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిషేధిత డ్రగ్స్‌ను తీసుకున్నా.. అమ్మకం చేసినా.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు ఆంజనేయులు, శ్రీనివాస్ నాయక్, రాందాస్, రాజాం, మోతిలాల్‌నాయక్, రాంబాబు, రవీందర్, పాపయ్య, రజిత, మున్నిసా బేగం, సమత, శ్రీవాణి, భాగ్యలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్ రూరల్: జిల్లాలో నాయకులందరి సమిష్టిగా కృషి వల్లనే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలోని ఆడిటోరియంలో క్రీయాశీలక సభ్యత్వ నమోదు కార్యాశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులు పాల్గొన్నారు. దేశంలోనే అత్యంత సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా వ్యవహరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 68వ జోనల్ లెవల్ అండర్17, 19 విభాగంలో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బుధవారం పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌లోని అగర్వాల్‌భవన్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నాలుగు జిల్లాల నుంచి 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి అండర్-17లో కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమాకాన్వెంట్‌కు చెందిన బిందుషా, వినోద్, ఎండి జిశాన్‌లు, అండర్-19లో వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రిష్‌కుమార్‌సింగ్, గీతా అగర్వాల్, సిమ్రాన్‌లు ఎంపికయ్యారని ఉష్ జిల్లా సెక్రటరీ,కోచ్ దేవయ్య తెలిపారు. ఎంపికై న వారిని ఈఎస్ఐ సూపరింటెండెంట్ జగన్, అగర్వాల్ భవన్ కమిటీ సభ్యులు నితీష్ అగర్వాల్, సాంబశివరావు, జితేందర్, శివమహేశ్ అభినందించారు.

ఆలోచన శక్తిని పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం దుర్గం జనార్దన్

రెబ్బెన: రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలోని ప్రతీ పుస్తకాన్ని చదివి విద్యార్థులు తమ ఆలోచన శక్తిని పెంచుకోవాలని నేర్పల్లి ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గం జనార్దన్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు పఠన కృత్యాలు నిర్వహించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించి, పోస్టర్ ఆవిష్కరించారు. పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లేందుకు పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తల గురించి తెలిపారు. కొత్త విషయాలు, పదాలు నేర్చుకోవాలని సూచించారు.

పరామర్శ

బెజ్జూర్: మండలంలోని గోల్కొండ గ్రామ యువకులు జహీర్ హుస్సేన్, ఇర్షాద్, మోయిస్‌లు ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి మృతిచెందగా.. బుధవారం కుటుంబ సభ్యులను సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, బుస శంకర్, పర్వీన్ సుల్తానా ఉన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీఐ బుద్దె రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సైనికుల్లా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమన్నారు. అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతీ సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్



నిందితులతో ఫారెస్టు అధికారులు

తిర్యాణి: అడవి పంది మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి (సిర్పూర్ కోర్టు)ఆదేశాల మేరకు 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్టు రెంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గంభీరావుపేట గ్రామానికి చెందిన దుర్గం బానయ్య అనే వ్యక్తి గ్రామ శివారులోని తన పంట పోలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలను అమర్చాడు. ఈనేపథ్యంలో మంగళవారం అడవిపంది విద్యుత్ తీగలకు తాకి మృతి చెందింది. మృతి చెందిన అడవిపందిని తీసుకెళ్తుండగా జల్లె సత్తయ్యను అదుపులో తీసుకొని ఇద్దరిపై కేసు నమెదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడే వారి పట్ల కఠినంగా వ్యహరించడంతో పాటు అడవుల సంరక్షణలో ఎలాంటి రాజీ పడేదిలేదన్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారి శ్రీనివాస్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అనిల్‌కుమార్, బీట్ అధికారి మధుకర్ ఉన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన జీఎం



వార్డులను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని బుధవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డులతో పాటు పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మంచి ఆహారాన్ని అందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుకుమార్, తదితరులు పాల్గొన్నారు.